## క్లుప్తంగా

### గ్రామ అభివృద్ధికి కృషి



అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

**ఇచ్చోడ:** తలమద్రి గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం తలమద్రి గ్రామస్తులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అంబేడ్కర్ చిత్రపటం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తుల కోరిక మేరకు తలమద్రిలో పర్యటించి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ గ్రామ పరిస్థితులు తనకు తెలుసన్నారు. గ్రామాల్లో నెల కొన్న సమస్యలు దశల వారీగా పరిష్కారిస్తామన్నారు. మాజీ ఉప సర్పంచ్ భగత్ అడేళ్ల, పాముల రవి కుమార్, సుమన్, కోటేశ్వర్, వినోద్, గంగాధర్, శివ పాల్గొన్నారు.

### రోగ నిరోధక టీకాలు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్‌వో బ్రహ్మానందంరెడ్డి

**ఇచ్చోడ:** ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు తీసుకోనే విధంగా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎస్‌వో బ్రహ్మానందం రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గేర్జం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందచేసే రోగ నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేస్తూ.. మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ కమల, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఆశ వర్కర్ లావణ్యలు ఉన్నారు.

### కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కై లాస్‌నగర్:** ప్రధానీ నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రధాన మంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను బుధవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ నాయకులు గిమ్మ సంతోష్ , భుక్తాపూర్ మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, ఆవుల వెంకన్నలు తన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన సేవలను కొనియాడిన నాయకులు ఇలాంటి మరెన్నో అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

### కొనసాగుతున్నశివపురాణం

**ఇచ్చోడ:** మండల కేంద్రంలోని శివలయంలో శివపురాణం గత నాలుగు రోజుల నుంచి కొనసాగుతోంది. ప్రతీ రోజు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు భీమాశంకర్ మహరాజ్ శివపురాణ పఠనం గావిస్తున్నాడు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి పురాణంను వింటున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రతీ రోజు అన్నదాన నిర్వహిస్తున్నారు. మరో మూడు రోజుల పాటు శివపురాణ పఠనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### రజతోత్సవాన్ని విజయవంతం చేయండి

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. బుధవారం మండలంలోని ఖాప్రి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామంలో తిరుగుతూ సభకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, గణేష్ యాదవ్, ఊశన్న, రామన్న,

### కార్యవర్గం ఎన్నిక

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దినేష్ మటోలియా, ఉపాధ్యక్షుడిగా మతీన్, ప్రధాన కార్యదర్శిగా కందుల రవీందర్, సహా కార్యదర్శిగా ప్రమోద్ కుమార్, కోశాధికారిగా మనోహర్, కార్యవర్గ సభ్యులుగా రాఘవేంద్ర, శ్రీనివాస్, సంతోష్ అగర్వాల్, సూర్యకాంత్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

# మూగజీవాలు విలవిల..!

- ఎండలకు అల్లాడుతున్న పశువులు
- వడదెబ్బ తగిలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారుల సూచన

**మండలంలోని పశువుల వివరాలు..**

| | |
|---|---|
| ఆవులు | 8,851 |
| గొర్రెలు | 10,553 |
| మేకలు | 7,704 |
| గేదెలు | 2,510 |
| కోళ్లు | 9,703 |



సావర్గాం శివారులో చెట్టు కింద సేదతీరుతున్న మూగజీవాలు

**తాంసి:** జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. ఎండ తీవ్రతకు మనుషులే కాకుండా మూగజీవాలు అల్లాడుతున్నాయి. వాగులు, చెరువుల్లో నీరు అడుగంటి బోసిపోతున్నాయి. పశువులు పశుగ్రాసం కోసం పంటచేలకు వెళ్లితే చెరువుల్లో నీరు లేక తాగునీరు దొరకని పరిస్థితి ఉంది. సరైన సమయంలో తాగేందుకు నీరు దొరకక వడదెబ్బకు గురై మృత్యువాత పడే అవకాశం ఉంది. దీంతో వేసవిలో తప్పనిసరి పాడిపశువులు, మూగజీవాల పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడి వ్యాధులు సోకితే పశువైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యం అందిస్తే త్వరగా కొలుకునే అవకాశం ఉంది.

**నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలి..**

పశువులు, మూగజీవాలకు వేసవిలో రెండు పూటల నీటిని తాగించాలి. సుమారుగా రోజుకు 50 నుంచి 60 లీటర్ల వరకు నీటిని తాగించాలి. పుష్కలంగా నీరు తాగించడం వలన డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. నీరుతో పాటు పచ్చిమేత అందించాలి. పంటచేలకు వెళ్లిన పశువులు మధ్యాహ్నం సమయంలో చెరువుల్లో, కుంటల్లో నీరు తాగించడం మంచిది కాదు. ఎండవేడికి నీరు వెడెక్కి ఉండటంతో వేడినీరు తాగడం వలన మూగ జీవాలు, పశువుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ఎండకు కొట్టాలలో, చెట్ల నీడన సేదతీరే విధంగా చూడాలి.

**ఎండ నుంచి రక్షణ చర్యలు..**

- ఎండ ప్రభావం పడకుండా ఉండాలంటే పాకలలో తగిన జాగ్రత్తలు చేపట్టాలి.
- చల్లదనం కోసం కంది కర్రలను, గడ్డి కట్టలను ఉంచి కప్పి వేయాలి.
- ఉదయం, సాయంత్రం నీటితో తడిపితే చల్లదనం ఉంటుంది.
- పశువులు వడదెబ్బకు గురికాకుండా చూడాలి.

**జాగ్రత్తలు పాటించాలి**



ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న ఎండల తీవ్రతతో పశువుల రైతులతో పాటు వివిధ పశువుల పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలి. సరైన సమయంలో నీరు పశుగ్రాసం అందించేలా చూడాలి. పశువుల చుట్టూ చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి, తాంసి

## వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని భోరజ్ మండలంలోని పిప్పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశికళ అన్నారు. బుధవారం పాఠశాలలో పోషకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించి ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో సెలవుల్లో విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలను ప్రాక్టీస్ చేయించాలన్నారు. దినపత్రికలు చదివించడం, వార్తా ప్రసారాలను చూపించడం, కథలు చెప్పడం, పిల్లలతో కొంత సమయాన్ని గడపాలని పేర్కొన్నారు. వారితో ఉల్లాసంగా గడపాలని అన్నారు. ఇదిలా ఉండగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులకు వేసవిలో చదవడానికి గ్రంథాలయ పుస్తకాలతో పాటు పాత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభయ్ కుమార్, రఘు రమణ, స్వాతి, మాళవిక, మాధురి, జయకర్, అనిత, పోషకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్‌రూరల్:** సనాతనంగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు తెలియచేస్తూ సన్మార్గంలో నడవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మండలంలోని చాందా (టి) గ్రామంలో నిర్మించిన రేణుక మాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ నిధులు ఖర్చు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షల సాయం అందించడం పట్ల గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, పండ్ల శ్రీనివాస్, కొండ గణేష్, దమ్మపాల్, బట్టు సతీష్, కుమ్ర రాజు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు



విద్యార్థులతో అధ్యాపకులు

**ఆదిలాబాద్‌రూరల్:** మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్మీడియేట్ విద్యార్థులను అధ్యాపకులు బుధవారం అభినందించారు. ద్వితీయ సంవత్సరంలో మునేశ్వర్ సుహాని 1000 మార్కులకు 972 సాధించి జిల్లా ఆదర్శ పాఠశాలలో ఉన్నతంగా నిలిచిందని అధ్యాపకులు తెలిపారు. బైపీసీ విభాగంలో కాంబ్లే శ్వేత 418, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఠాకూర్ వైష్ణవి 897, మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో సాయిచరణ్ 470కు 461 మార్కులు సాధించి టాపర్‌గా నిలువడం జరిగిందన్నారు. సీఈసీ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు 960 మార్కులు ఆశ్విత సాధించడం జరిగిందన్నారు. ప్రథమ సంవత్సరంలో సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను 465 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కావొద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

**ఆదిలాబాద్‌టౌన్:** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.సంగీత అన్నారు. బుధవారం కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై చర్చ గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లఘు చిత్రం, కవితా పఠనం, క్విజ్, వీధి నాటకాలను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్ సమన్వయకర్త డాక్టర్ రమేశ్, లెక్చరర్లు అరుణ్ కుమార్, డి.ఎస్ చక్రవర్తి, అష్రఫ్ అలీ, సంతోష్ కుమార్, రవికిరణ్, జ్యోత్స్న, రాజ్ కుమార్, శ్రీనివాస్, పోలీస్ అధికారి రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



అర్హుల జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**బేల:** అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎంపీడీవో మహేందర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని టాక్లీ, బాది, అవాల్‌పూర్ గ్రామాల్లో పర్యటించి, ఇటీవల ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇళ్ల మంజూరుకు ఇచ్చిన జాబితాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మంజూరు కోసం దళారులను నమ్మొద్దని, ఎవరికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. ఇంటి నిర్మాణానికి స్థలం ఉండడంతో పాటు గుడిసె, పెంకుటిల్లు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు ఈ దఫాలో ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

### గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

**నేరడిగొండ:** పాడి రైతులు పశువులకు ఉచిత గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామంలో పశువులకు సామూహిక ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమం మే 17వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామాల వారీగా పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పాఠశాల వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న సామాజిక సేవకులు

**బోథ్:** బోథ్ మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల, కౌట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం, పాడిన పాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా వారికి ముఖ్య అతిథులు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

**ఆదిలాబాద్‌టౌన్:** సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న డీపీఓ, ఎమ్మార్సీ, సీఆర్‌పీ, ఐఈఆర్సీలలో తాత్కాలికంగా మూడు రోజుల పాటు తొలగించి మళ్లీ రీఇంగేజ్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం సమ్మె విరమణ ఒప్పందాలను అమలు చేయాలని తెలిపారు. పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు 12నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## యువత భవిష్యత్ కోసం పని చేయాలి



పెందురు సంతోష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయుడు

**నార్నూర్:** ఆదివాసీ యువత బంగారు భవిష్యత్ కోసం పని చేయాలని ఝరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాథోడ్ రవీందర్ అన్నారు. మారుమూల మండలం నుంచి ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెందూర్ సంతోష్ ఎన్నికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌లో పాటు పాఠశాలలో నెలకొన్న మౌలిక సదుపాయాలు కల్పన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నార్నూర్:** రైతులకు ఇబ్బంది కలగకుండా జొన్న కొనుగోలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో ఆమె జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు నష్టపోకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సూచించారు. ఇటువంటి షరతు లేకుండా జొన్న కొనుగోలు చేయాలన్నారు.

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆడబిడ్డ పెళ్లి కోసం ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, ప్యాక్స్ చైర్మన్ ఆడియో సురేశ్, సీఈవో ఆడే గణేష్ పాల్గొన్నారు.

## తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



హెల్మెట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**ఇంద్రవెల్లి:** ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రముఖ వ్యాపారి చింతవార్ దీపక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించిన తేరివి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు అందించిన హెల్మెట్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, చింతవార్ సంతోష్, కేశవ్ ముస్లే, కాంగ్రెస్ నాయకులు మసుద్, జితేందర్, జహీర్ పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్లకు సర్టిఫికెట్ శిక్షణ



శిక్షణనిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**కై లాస్‌నగర్:** న్యాక్ ద్వారా అందించే సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఎలక్ట్రీషియన్‌లకు బుధవారం వృత్తినైపుణ్య శిక్షణనిచ్చారు. జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణ నైపుణ్యం అవగాహన కల్పించారు. ఎలక్ట్రీకల్ ఫైర్ జరిగిన సమయంలో ఏ విధంగా వ్యవహరించాలి, ఆ మంటలను ఎలా ఆర్పాలనే అంశాలపై అగ్నిమాపక సిబ్బంది శిక్షణనిచ్చారు. ప్రాక్టికల్ , థియరీక్లాస్‌లను సైతం వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని వృత్తిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు ద్యావంత్ రమేశ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**బోథ్:** కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా బోథ్ మండల కేంద్రంలో గ్రామస్తులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. అలాగే కౌట గ్రామంలో గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సొనాల గ్రామంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. వారు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

**ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం**

**ఆదిలాబాద్‌టౌన్:** లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' పహెల్గామ్లో జరిపిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగన్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ దాడిలో ఇద్దరు విదేశీయులు, ఇద్దరు స్థానికులు సహా కనీసం 26 మంది మృతిచెందారని తెలిపారు. గాయపడిన వారిలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**ఉట్నూర్‌రూరల్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు బానోత్ జగన్, కొండేరి రమేశ్, వెంకటేశ్, కిరణ్, దేవిదాస్ పాల్గొన్నారు.



**చేపల వేటలో కొంగలు**

తలమడుగు మండలంలోని కజ్జర్ల చెరువులో వందల సంఖ్యలో కొంగలు మండుటెండలో చేపల వేట కోసం కొంగ జపం చేస్తున్నాయి. కనిపించిన చేపలను వేటాడి పొట్ట నింపుకుంటున్నాయి.

– తలమడుగు